

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**తిరిగి ఎగ్జామ్స్** టైం వచ్చేసరికి అందరూ బిజీ అయిపోయారు. లైబ్రరీ కిటకిటలాడింది. నేను, రెయిన్ లాబ్‌లోనే చదవడం మొదలు పెట్టాము. ఇండియాలోలాగా మొత్తం సిలబస్ కాక కేవలం మిడ్‌టర్మ్ తరవాతవి మాత్రమే పరీక్షలో అడుగుతారు కనుక అంత కష్టంగా అనిపించలేదు. చలికాలం కావడంతో త్వరగా చీకటి పడిపోయింది. దాంతో రాత్రి పదకొండింటికే ఉదయం మూడువరకు చదివినట్టు అనిపించింది. దాంతో కొన్నిసార్లు చాలాసేపు చదివి అలిసిపోయినట్టు అనిపిస్తే, మరి కొన్నిసార్లు ఎక్కువసేపు నిద్రపోయినట్లు అనిపించింది. ఇవి ఫైనల్ ఎగ్జామ్స్ కావడంతో గ్రాడ్యుయేట్ అయ్యే వాళ్ళు ఇంటర్వ్యూలని, ఓపిటీ అని చాలా కంగారు పడ్డారు. వాళ్ళ టెన్షన్ చూసి ఫైనల్ సెమిస్టర్‌లో ఎగ్జామ్స్ కి ముందే జాబ్ దొరకాలని తెలుసుకున్నాను. చివరిసారిలాగే ప్రొఫెసర్ థీసిస్‌ని పక్కన పెట్టి ముందు ఎగ్జామ్స్ కి చదవమని

చెప్పారు. నేహ ఎప్పటిలానే ఎగ్జామ్స్ కి చదివేందుకు ఫ్రోజెన్‌ఫుడ్ తినడం మొదలు పెట్టింది. ఇదేదో సులువుగా ఉందని నేనూ అంతే చేసాను. ఉన్నవి మూడు సబ్జెక్టులే అయినా ఎంతో కష్టపడి చదవాల్సి వచ్చింది. నేను అనుకున్నంత సులువుగా అయితే లేదు. మొత్తానికి పరీక్షలు పూర్తయ్యాక కానీ నేను ప్రశాంతంగా ఉపిరి పీల్చుకోలేదు.

సెలవులకి అందరూ ఇండియాకి లేదా రోడ్ ట్రిప్స్‌కి వెళ్ళారు. కొంతమంది ఇక్కడే ఉండి జాబ్ సెర్చ్‌లో పడ్డారు. నేను ఎప్పటిలానే అన్నయ్య దగ్గరికి వెళ్దామని టికెట్ బుక్ చేసాను. పరీక్షలపప్టి అలసట మొత్తం తీరింది నేను ఒక పదమూడు గంటల పాటు నిద్రపోయిన తరవాతే.

నేహ, తన బాయ్‌ఫ్రెండ్ నన్ను ఎయిర్‌పోర్ట్‌లో దింపారు. ఎందుకో ఈసారి చాలా సంతోషంగా అనిపించింది. నేను ఫ్లైట్ దిగేసరికి అన్నయ్య అక్కడే ఉన్నాడు. ఫోన్‌లో అన్ని వివరాలు చెప్పినా మళ్ళీ మా రోడ్ ట్రిప్ సంగతులన్నీ విడమరచి చెప్పాను.

"రోడ్ ట్రిప్ సరే, ఎగ్జామ్స్ ఎలా అయ్యాయి?" ఇల్లు చేరాక అడిగాడు.

"బాగా రాసాను. మిడ్ టర్మ్స్ కన్నా మంచి మార్కులే వస్తాయి" బదులిచ్చాను.

"గుడ్. థీసిస్ ఎంతవరకు వచ్చింది?"

"పర్లేదు."

"అంటే?"

"ఒక క్లారిటీ అయితే ఉంది ఏం చెయ్యాలని."

"అది మీ ప్రొఫెసర్ ఇచ్చి ఉంటారు కదా?"

"యా. అంటే నా ప్రపోజల్స్‌లో ఒకటి పిక్ చేసారు."

"సెమిస్టర్ మొత్తం కలిపి అంతేనా చేసింది?"

"ఇంకా లిటరేచర్ రివ్యూ కూడా స్టార్ట్ చేసా."

"అది డిఫెన్స్‌కి ముందు కూడా చేయచ్చుగా?"

"యా. కానీ ప్రొఫెసర్ స్టార్ట్ చెయ్యమన్నారు."

"మరి అసలు లేకుండా వడ్డీలాగా ఉంది."

నిశబ్దంగా ఉన్నాను.

"ఎక్స్‌పరిమెంట్ కానీ సెటప్ కానీ ఇంకా మొదలు పెట్టలేదా?"

"ఇంకా లేదు. వెళ్ళాక మొదలు పెట్టాలి. ఇదివరకు చదివిన వాళ్ళు ఏదో చేసారట. అవి చూసి పనికొస్తే అవే వాడతాను, లేకపోతే కొత్తవి చెయ్యాలి సెటప్‌కి."

"నీ ప్రొఫెసర్ ఏమీ అనలేదా ప్రోగ్రెస్ లేకపోతే?"

"ఎందుకు లేదు? ప్రోగ్రెస్ ఉందిగా. ఎట్‌లీస్ట్ ఫైనల్ అయ్యింది ప్రాజెక్ట్."

చిన్నగా నవ్వి "ఒక ప్రాజెక్ట్ డిసైడ్ అవ్వడానికే ఒక సెమిస్టర్ పడితే ఇంక థీసిస్ ఎప్పుడు పూర్తవుతుంది? నీ గ్రాడ్యుయేషన్‌కి నేను మనవళ్ళు, మనవరాళ్ళతో వస్తానేమో" నవ్వాడు.

నేను కోపంగా గదిలోకి వెళ్ళి నిద్రపోయాను. ఉదయం లేచేసరికి అన్నయ్య లేడు. టేబుల్ మీద ఫ్రిడ్జ్‌లో ఉన్నవేమైనా తినమని, రాత్రికి వాళ్ళ ఆఫీస్ పార్టీ ఉందని రాసాడు.

వెంటనే మెసేజ్ చేసి డిన్నర్ నా ఒక్కదానికే వండాలా అని అడిగాను.

"పార్టీకి నువ్వు కూడా వస్తున్నావు" బదులిచ్చాడు.

ఫ్రిడ్జ్‌లో ఉన్న టు గో డబ్బాల్లో ఉన్నవి లంచ్‌కి తినేసాను. టీవీ చూస్తుండగా అన్నయ్య వచ్చాడు.

"ఇంకా రెడీ అవ్వలేదా?" అడిగాడు.

"రెడీ అయిపోయి నీ గురించి వెయిట్ చేస్తున్నా" బదులిచ్చాను.

లోపలికి నడుస్తూ వెనక్కి తిరిగి చూసాడు.

"ఇలానే వస్తావా?" నా జీన్స్ పాంట్, టీ షర్ట్ చూసి అడిగాడు.

"షర్ట్ చేంజ్ చేసుకోవాలా?"

"డ్రస్ తీసుకురాలేదా?"

"ఒకటి తెచ్చానుకానీ స్నో పడుతుందిగా"

"స్టాకింగ్స్ లేవా?

"లెగ్గింగ్స్ ఉన్నాయి."

"అంటే? ఒకసారి డ్రస్ వాటితో వేసుకుని చూపించు."

లోపలికి వెళ్ళి మార్చుకుని వచ్చాను.

"బానే ఉంది ఇది. గంటలో బయలుదేరదాము."

"సరే, ఎలా అయ్యింది ఆఫీస్?"

"బానే అయింది. బోర్ కొట్టిందా?"

"కొంచెం. చాలా ఖాళీగా ఉన్నట్టు అనిపించింది."

"ఇన్ని రోజులు కష్టపడి చదివావన్నమాట."

"అదేంటి?"

"రోజూ కష్టపడి చదువుతూ బిజీగా ఉండి ఇవాళ ఏంలేకపోయేసరికి ఖాళీగా అనిపించుంటుంది."

దాదాపు నెల తర్వాత టెన్షన్ లేకుండా ప్రశాంతంగా ఉన్నాను అని అప్పుడు అర్ధమైంది.

కారులో వెళుతుండగా "నేను ఎలా ఉండాలి?" అడిగాను.

"అంటే?"

"నీలానే ఉండు. చంద్రముఖిలా మాత్రం మారకు" నవ్వాడు.

"అంటే నేను ఎప్పుడూ ఇలా పార్టీకి వెళ్ళలేదు."

"లాస్ట్ టైం కలిసిన వాళ్ళుంటారు. ఎవరైనా మాట్లాడిస్తే మాట్లాడు. బోర్ కొడితే నాకు చెప్పు. అందరూ ఫ్రెండ్లీగానే ఉంటారు."

"సరే."

పార్కింగ్ లాట్ చాలా పెద్దగా ఉంది.

"ఇది మీ ఆఫీసా" అడిగాను.

పెద్దగా నవ్వి, "లేదు క్రిస్మస్ పార్టీ ఇక్కడ పెట్టారు" అన్నాడు.

లోపలికి వెళుతుండగా అది హోటల్ అని తెలిసింది. లోపల ఒక పెద్ద క్రిస్మస్ చెట్టు, దాన్నిండా దీపాలు ఉన్నాయి. చూడటానికి అంతా కళకళలాడుతూ ఉంది.

"ఈ బాంక్వెట్‌లో ఇస్తున్నారు ఈసారి. లాస్ట్ టైం వేరే చోటికి వెళ్ళాము."

"మీ కో వర్కర్స్ ఏరి? నీకు వీళ్ళంతా తెలుసా?" అడిగాను.

"లేదు. వాళ్ళు వేరే డిపార్ట్‌మెరంట్ వాళ్ళు. కేవలం ముఖపరిచయం మాత్రమే."

ఇంతలో ఎవరో అన్నయ్యని పలకరించారు. అన్నయ్య వెంట నేనూ నడుచుకుంటూ వెళ్ళాను. నన్ను గుర్తుపట్టిన వాళ్ళు నాతో మాట్లాడారు. మిగతావారికి అన్నయ్య నన్ను పరిచయం చేసాడు. నేను ఏరోస్పేస్ ఇంజనీర్ అని చెప్పగానే అందరూ నేను చాలా తెలివైన దాన్ననుకున్నారు.

ఎగ్జామ్స్ గురించి మాట వరసకి అడిగారని అర్ధమైంది. నేను భయపడినట్టుగా వాళ్ళ లోకంలో వాళ్ళు లేకుండా, నన్ను కూడా కలుపుకుని మాట్లాడారు. అందరూ షాంపేన్ తీసుకుని టేస్ట్ చేస్తున్నప్పుడు అన్నయ్య నా చేతికి కూడా ఒక గ్లాస్ తెచ్చి ఇచ్చాడు. నేను ఆశ్చర్యపోయి అన్నయ్య మొహం చూసాను. కానీ అప్పటికి పక్కకి తిరిగాడు.

నేను తాగకుండా పక్కన పెట్టడం గమనించిన ఒకరు "ఇట్స్ బాడ్‌లక్. యు షుడ్ డ్రింక్" అన్నారు.

అన్నయ్య అది గమనించి "ట్రై చెయ్యి" అన్నాడు.

ఎంతో ఆశ్చర్యపోయి, చాలాసేపు ఆలోచించి, ఆ గ్లాసులో పదార్ధాన్ని వాసన చూసి, చుట్టు పక్కల జనాలని గమనించి, అన్నయ్య మొహం చూసాను.

తాగు అన్నట్టు సైగ చేసాడు.

తాగినట్టు నటిద్దామని ఒక చాలా చిన్న సిప్ తీసుకున్నాను.

"హౌ ఈజ్ ఇట్?" అడిగాడు.

"నైస్."

"దెన్ డ్రింక్."

ఇంకో సిప్ తాగాను. రుచి బాగానే ఉంది. ఇందుకే చాలామంది తాగుబోతులౌతారు కాబోలు అనిపించింది. అన్నయ్య నన్ను చూసి నవ్వి "ఇట్స్ నాట్ ఆల్కాహాల్. ఇట్స్ కార్బొనేటెడ్ జూస్" నవ్వాడు.

అక్కడ అందరూ నవ్వారు. జూస్ అని తెలియగానే సరిగ్గా రుచి చూసాను. ఎంతో బావుంది. అలా మూడుగ్లాసులు తాగాను. భోజనంలో వెజ్ ఏవో అన్నయ్య చెపితే దానిప్రకారం తిన్నాను.

ఇంటికి బయలుదేరినప్పుడు " బోర్ కొట్టిందా?" అడిగాడు.

"లేదు" అన్నాను.

"ఫుడ్ ఎలా ఉంది?"

"బానే ఉంది."

"నిజంగా షాంపేన్ ఇచ్చాను అనుకున్నావా?" నవ్వాడు.

"ఏం కాదు. అనవసరంగా షుగర్ ఎందుకని తాగలేదు ముందు."

"మరి మూడు గ్లాసులెందుకు తాగావు?" నవ్వాడు.

నేను చటుక్కున మాట మార్చి వాళ్ళల్లో ఎవరు  క్లోజ్ ఫ్రెండ్ అని అడిగాను.

"అందరూ చాలావరకు సమానమే. నా వయసువారు ఎక్కువ క్లోజ్. నిన్ను గ్రాడ్యుయేట్ ఎప్పుడౌతావని అడిగారు చూడు"

తలూపాను.

"ఆయన చాలా చాలా పెద్ద మేధావి. డౌన్ టు అర్త్ ఉంటారు కానీ ఎనిమిది పేటెంట్లున్నాయి."

"అవునా?"

"నీ పక్కన కూర్చున్న ఆవిడ తన భార్య."

"మీ ఆఫీసులోనే పనిచేస్తుందా?"

"లేదు. తను సర్జన్."

"ఓ. మరి మిగిలిన వాళ్ళు మీ ఆఫీసేనా?"

"చాలావరకు మా ఆఫీస్. కొంతమంది వాళ్ళకి సంబంధించినవాళ్ళు."

"ఓ.సరే."

"వాళ్ళల్లో ఒకరు మనని ఎల్లుండి డిన్నర్‌కి పిలిచారు."

"సరే."

"మంచి డ్రెస్ ఇంకేమైనా తెచ్చుకున్నావా?"

"ఇంకా ఒకటి ఉంది."

"గుడ్. అది వేసుకో."

ఇంతలో ఇల్లు చేరాము. పెద్దగా పని చేసి అలసిపోలేదు కనుక నిద్రపట్టదనికున్నాను కానీ బాగానే నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story